# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 143 | సోమవారం | 04 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


## రైతులకు మిచౌంగ్ గుబులు



2లో

# ఉత్కంఠ...






- సీఎం పేరుపై కొనసాగుతున్న సస్పెన్స్
- అయోమయంలో ప్రజలు, పార్టీ శ్రేణులు
- రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు
- గెజిట్ విడుదల చేసిన గవర్నర్
- అనూహ్యంగా ఢిల్లీకి పయనమైన పరిశీలకులు



కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు స్పష్టమైన మెజారిటీ ఇచ్చినప్పటికీ ముఖ్యమంత్రి ఎవరనే టెన్షన్ కొనసాగుతోంది. సోమవారం ఉదయమే ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని అందరూ భావించినప్పటికీ అది కాస్త వాయిదా పడుతూ వస్తోంది. అప్పుడూ, ఇప్పుడూ అంటూ సా.. గుతున్న ప్రచారాలతో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం పేరును ప్రకటించాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో ఆలస్యం అవుతూ వస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే అభిప్రాయాలను అధిష్ఠానానికి పంపినా సీఎం ఎంపికలో మాత్రం స్పష్టత రాలేదు. దీంతో డీకే శివకుమార్‌తో పాటు నలుగురు పరిశీలకులు హుటా హుటినా ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత సోనియా గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున్ ఖార్గేతో వీరు సమావేశం కానున్నారు. ఆ తర్వాతే ముఖ్యమంత్రి పేరును ఖరారు చేయనున్నట్లు తెలియవచ్చింది. అయితే సీఎం ఎవరనే విషయం తెలియక రాష్ట్ర ప్రజలు, పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

## న్యాయవాదుల సంబరాలు




8లో..

## ఘనంగా పోతన జయంతి

ముఖ్య అతిథిగా శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్య




2లో

## ఐటీ హబ్ ఏర్పాటు చేయాలి

- తూర్పును అన్ని రంగాల్లో ముందుంచాలి
- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవీందర్



2లో

# ఉత్కంఠ..



**సీఎం పేరుపై కొనసాగుతున్న సస్పెన్స్**

**అయోమయంలో ప్రజలు, పార్టీ శ్రేణులు**

**రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు**

**గెజిట్ విడుదల చేసిన గవర్నర్**

**అనూహ్యంగా ఢిల్లీకి పయనమైన పరిశీలకులు**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** తెలంగాణలో సీఎం ఎవరూ అనే సస్పెన్స్ కొనసాగుతోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేవరకు గచ్చిబౌలీలోని ఎల్లా హెూటల్ వద్ద నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సీఎల్పీ నేతను ఎన్నుకునే బాధ్యతను ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ కార్గేకు అప్పగించినప్పటికీ పీఠముడి వీడడంలేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల అభిప్రాయాలను తెలుసుకుని పూర్తి సమాచారాన్ని అధిష్ఠానానికి తెలిపినప్పటికీ సీఎం ఎవరనే విషయంలో సస్పెన్స్ మాత్రం వీడడంలేదు. అయితే కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ మీటింగ్ నుంచి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ మధ్యంతరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.



### పూర్తి మెజారిటీ..

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మెజార్టీ వచ్చింది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకు గాను సొంతంగా 64 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. దీంతో ఆదివారం రాత్రి ఎమ్మెల్యేలతో సీఎల్పీ సమావేశం నిర్వహించి సోమవారం కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం ఉంటుందని అందరూ భావించారు. ఇందుకుగాను ఎల్ బీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం సాగింది. సీఎల్పీ సమావేశం ఆలస్యం కావడంతో సోమవారం రాత్రి వరకు ఏదో ఒక సమయంలో ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందంటూ లీకులొచ్చాయి. ఆ దిశగా ఏర్పాటు జరిగినప్పటికీ ముఖ్యమంత్రి పేరు ప్రకటించడం ఆలస్యం కావడంతో అంతా అయోమయంగా మారింది.

### ఢిల్లీకి డీకే శివకుమార్..

సోమవారం రాత్రి కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం ఉంటుందని అందరూ భావించినప్పటికీ అది వాయిదా పడినట్లు తెలుస్తోంది. ప్రత్యేక విమానంలో ఏఐసీసీ పరిశీలకులతో కలిసి కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రాత్రి కొత్త ఢిల్లికి చేరుకున్నారు. వీరు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత సోనియా గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున్ కార్గేతో సమావేశం కానున్నారు. ఆ తర్వాతే కొత్త ముఖ్యమంత్రి పేరును ప్రకటించనున్నట్లు సమాచారం.



### రాజ్ భవన్‌లో ఏర్పాట్లు..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో ప్రమాణస్వీకారానికి రాజ్‌భవన్ ముస్తాబైంది. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సోమవారం సాయంత్రమే ప్రమాణస్వీకారం ఉండవచ్చన్న సమాచారం నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఇందుకు అవసరమైన కుర్చీలు, షామియానా సహా ఇతరత్రా సామాగ్రిని రాజ్ భవన్ కు తరలించారు. సాధారణ పరిపాలనా శాఖ, ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ సహా ఇతర శాఖల అధికారులు అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

### గెజిట్ నోటిఫికేషన్..

సీఈవో వికాస్ రాజ్ సాయంత్రం 4 గంటలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ను కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలను నివేదిక రూపంలో ఇవ్వడంతో పాటు పాత ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ను అందించారు. దీంతో తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ ఏర్పాటుకు మార్గం సిద్ధమైంది. ఆ తర్వాత కొత్త ముఖ్యమంత్రికి సంబంధించిన ప్రమాణస్వీకార ప్రక్రియ అధికారికంగా ప్రారంభం అవుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ ను దాటిన కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షనేతగా ఎన్నికైన వారి పేరును గవర్నర్ కు నివేదించి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. అనంతరం సీఎల్పీ నేతకు డిజిగ్నేటెడ్ సీఎం హెూదా ఇచ్చి ప్రమాణ స్వీకారానికి గవర్నర్ ఆహ్వానిస్తారు.

### కొత్త కాన్వాయ్..

రాజ్ భవన్ వద్ద కొత్తగా ప్రమాణ స్వీకారం చేయనున్న ముఖ్యమంత్రి కోసం కొత్త కాన్వాయ్ ని అందుబాటులో ఉంచారు. ఇందుకోసం కొత్తగా ఆరు ఇన్నోవా కార్లను రెడీ చేశారు. ఇందులో నాలుగు వెహికిల్స్ కు నెంబర్ ప్లేట్లు ఉండగా మరో రెండింటికి నెంబర్లున్నాయి. ప్రోటోకాల్ అధికారులు వీటిని కొత్త సీఎం కోసం రెడీ చేసినట్లు తెలుస్తోంది. ప్రమాణ స్వీకారం అనంతరం కొత్త సీఎం ఈ కాన్వాయ్ లోనే తన ఇంటికి చేరుకుంటారని అధికారులు ప్రకటిస్తున్నారు.

## ఘనంగా పోతన జయంతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ కళాశాలలో సోమవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో పోతన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏవీవీ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎల్ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కలియుగ మానవుడు తరించి పోవాలంటే భాగవతమే ఏకైక సాధనమన్నారు. ప్రారబ్ద కర్మలను తొలగించి ముక్తిని పొందుటకు ఉపకరించే గ్రంథరాజం భాగవతం అన్నారు ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీమాన్ సముద్రాల శటకోపాచార్య భాగవత కథలోని ముఖ్యమైన ఘట్టములను వివరించారు. విద్యార్థులు భక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్ని ఆర్జించాలని సూచించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.భుజయేందర్ రెడ్డి మాట్లాడుతూ గత 60 సంవత్సరములుగా పాఠశాల విద్యార్థులకు భాగవత పద్య పఠన పోటీలు నిర్వహిస్తూ బాల్యము నుంచే పిల్లలలో ఆధ్యాత్మిక స్పృహను కలిగిస్తున్నామన్నారు. డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు ఆచార్య చందాకాంతయ్య శ్రేష్టి ఆలోచనలతో ప్రారంభమైన పోతన జయంతి వేడుకలను మన ఏవీవీ కళాశాలలోనే వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయకుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు ఏవీవీ విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం పద్య పటన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. చివరకు జరిగిన సాంస్కృతిక కార్యక్రమములు సభికులను అలరించాయి.

## ఐటీ హబ్ ఏర్పాటు చేయాలి

**తూర్పును అన్ని రంగాల్లో ముందుంచాలి**

**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవీందర్**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవీందర్ కోరారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితోపాటు తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు హార్ధిక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ గత పాలకుల మాదిరిగా కాకుండా కొండా సురేఖ ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి మార్గాలు చూపాలన్నారు. తెలంగాణలో ఈ విజయాన్ని ప్రజల గెలుపుగా భావిస్తూ పరిపాలన చేయాలని సూచించారు. ప్రజల మనోబావాలను గౌరవిస్తూ, ప్రతిపక్ష పార్టీలను గౌరవిస్తూ అన్ని రంగాల్లో తూర్పు నియోజక వర్గాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. తెలుగు దేశం పార్టీ నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. తూర్పు నియోజకవర్గాన్ని సుందరమైన నగరంగా మార్చాలని, ఒక ఐటీ హబ్ ఏర్పాటు చేయడంతోపాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సిరబోయిన రాజు, జీఎల్ శ్రీధర్, బజ్జూరి వీరేశం, పిట్ట సత్యనారాయణ, కంద్రాతి రాజు, పోలెపాక సాయికుమార్, తౌటం సంపత్ కుమార్, సింగాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి

**లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు**

**భారత కమ్యూనిస్టు పార్టీ హెచ్చరిక**

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా వెంకటాపూర్ మార్కెట్ లలో రైతులవద్ద వరి, పత్తి కొనుగోలు చేస్తున్న ఖరీదు దారులు మోసానికి వ్యతిరేకంగా పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. సీసీఐ లేకుండా పత్తి పంటను కొనుగోలు చేయడంతోపాటు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జమ్మికుంటలోని రైస్ మిల్ బడా యజమానులు బచ్చు భాస్కర్, ముక్క నారాయణ కలిసి చిన్న మిల్లర్లతో సిండికేట్ అయి రాజకీయ నాయకులు, అధికారులకు కమీషన్లు ఇచ్చి అమాయకంగా ఉన్న, సపోర్ట్ లేని రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. మిల్లుల వద్దకు ధాన్యం, పత్తి తీసుకెళ్ళిన తరువాత రెండు కిలోల నుంచి పది కిలోల వరకు కట్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ ధర కంటే రూ.305 నుంచి రూ.500 వరకు తక్కువ ఇస్తూ అమాయక రైతులను మోసం చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల అండతో రైతులకు ఎవరు మద్దతు లేరని విర్రవీగుతూ రైతులను బెదిరించి అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. లేకుంటే రైతుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు.

## రైతులకు మిచౌంగ్ గుబులు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** రైతులకు మిచౌంగ్ తుఫాన్ గుబులు పట్టుకుంది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ వలన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ వలన తెలంగాణలో కూడా రానున్న రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో వర్షం పడితే చేతికి అందే సమయంలో పంట నష్ట పోవాల్సి వస్తుందని రైతులు భయపడుతున్నారు. మరో వైపు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ముందస్తు వరి కోతలు చేసిన రైతుల ధాన్యం కుప్పలు భారీ ఎత్తున పేరుక పోయాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. వర్షాకాల ప్రారంభంలో కురిసిన భారీ వర్షాలకు ఆదిలోనే నష్టాలు చవి చూసిన రైతులకు ఇప్పుడు పంట కోతకు అందే దశలో మిచౌంగ్ తుఫాన్ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

# ప్రజల తీర్పును స్వాగతిస్తున్నా..

## గండ్ర వెంకట రమణారెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రాజకీయాలలో గెలుపు, ఓటములు సహజమని, ఎవరు కూడా అధైర్య పడొద్దని, పదవులు ఉన్న లేకున్నా ప్రజలకు అండగా ఉంటానని గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. భారత రాష్ట్ర సమితి భూపాలపల్లి కార్యాలయంలో మీడియా సమావేశాన్ని గండ్ర వెంకట రమణా రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సోమవారం ఏర్పాటు చేసి మాట్లాడారు. తన గెలుపు కోసం కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు, నాయకులు, నాకు ఓటువేసిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫలితాల చాలా నిరాశను కలిగించాయని, గడిచిన 5ఏళ్లలో ఎంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన్నప్పటికీ ప్రజలు ఇచ్చిన తీర్పు శిరసవహిస్తున్నానని పేర్కొన్నారు. కరోన లాంటి పరిస్థితుల్లో నిత్యం ప్రజలకు అంత్యంత చేరువగా ఉండి సేవలని అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పరమైన కార్యక్రమాలతో పాటు, జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా చాలా సేవలను అందించామని, భూపాలపల్లికి ప్రత్యేక గుర్తింపు కోసం అహర్నిశలు కృషి చేసినట్లు తెలిపారు. ప్రజల తీర్పు స్వాగతిస్తున్నానని గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. ప్రజల తీర్పుతో గెలిచిన సత్యనారాయణ రావును అభినందించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని పూర్తి స్థాయిలో నెరవేర్చే దిశగా పనిచేయాలని కోరుకుంటున్నట్లు కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను 100రోజుల్లో అమలు చేస్తారనే నమ్మకంతో ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలని సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఓటమిలో జరిగిన వెన్నుపోటుపై పార్టీ అధిష్టానానికి నివేదిక అందిస్తానని చెప్పారు. చాలా వరకు జరిగిన పార్టీ ఫిరాయింపుల పట్ల మండల స్థాయిలో నివేదికలు తీసుకుని పార్టీ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడికి తెలియజేస్తానని చెప్పుకొచ్చారు. కార్యకర్తలు, నాయకులు ఎవరు అధైర్య పడొద్దని, అందరికీ అండగా ఉంటానని అన్నారు.

## శ్రీ దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని పెగడపల్లి డబ్బాల క్రాస్ వద్ద గల శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రెండో మహా పడిపూజ, అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఒక కమిటీ వేయడం జరిగింది. ఈ కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా దండబోయిన శ్రీకాంత్, అధ్యక్షుడిగా చాగంటి రాజు, ఉపాధ్యక్షులుగా గుంటి కమలాకర్, నీలం లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా సోమ కనకయ్, సీతా గణేష్, కోశాధికారులుగా అనిశెట్టి రజనీకాంత్, చిర్ర ప్రవీణ్ కుమార్ గౌడ్, ఆర్గనైజేషన్ కార్యదర్శులుగా దుంపల మధు, కొత్త వినయ్ కుమార్, దుబ్యాల శ్రీనాథ్, కనకరాజు, ఆర్గనైజర్లుగా కొండ గూడూరు రామకృష్ణ, కందారపు రాజు, ఆలేటి శ్రీనివాస్, దొరికిన విజేందర్, కోడిపాక బాబురావు, బైన సంతోష్, దుంపల కృష్ణ, పున్నం జగన్, దుండ అజయ్ వర్మ, ఉప్పుల రాజు పటేల్, గండ్రతి నిరంజన్ పటేల్ లను ఎన్నుకున్నారు. ఎన్నికోబడిని ఈ కమిటీ, ఆంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులు పూర్తి సనాతన ధర్మాలతో కూడిన ధర్మబద్ధ కార్యక్రమాలు నిష్పక్షపాతంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరికీ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ వ్యతిరేకతతోనే గెలిచిన కాంగ్రెస్

### కాంగ్రెస్ జిల్లా నాయకుడు ప్రభాకర్ పటేల్



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కేయడం, నిరంకుశంగా ఒక వైపున నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం, విద్యార్థులకు పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించకపోవడం, ప్రాజెక్టులు కట్టిన నాణ్యత లోపం ఉండడం గత తొమ్మిదిన్నర ఏండ్ల నుంచి డబుల్ బెడ్ రూమ్ అని ఆశ చూపుతూ ఇవ్వకపోవడంతో ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్ పార్టీ గెలిపించారని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా నాయకుడు ప్రభాకర్ పటేల్ అన్నారు. దళిత బంధు బీసీ బందు పేరుతో ఆశ చూపుతూ ఇవ్వకపోవడంతో పాటు కార్మికులకు ఉపాధి కల్పించకపోవడం, ధర్నా చౌకులు వేయడం కూగా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరస్కరించండానికి కారణాలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, సానుభూతిపరులకు, ప్రజలకు సాయిలి ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విశ్వబ్రాహ్మణులకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర విశ్వబహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల రమేష్ ఆధ్వర్యంలో దేశాయిపేట్ రోడ్ లో వరంగల్ జిల్లా కమిటీలో కాసోజు శ్రీకాంత్ చారి 14వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ అస్పిరంట్ , అంతర్జాతీయ క్రీడా విజేత, రిటైర్డ్ సహాయ కార్మిక కమిషనర్, వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్టడ్ గవర్నర్, టీపీసీసీ, ఎస్సీ రాష్ట్ర కన్వీనర్ భారతి కురాకుల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణలకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని, కాబట్టి ఈ కొత్త ప్రభుత్వంతో చర్చించి విశ్వబ్రాహ్మణులకు న్యాయం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సామాజిక న్యాయవేదిక అధ్యక్షుడు కలకొటీ శ్రీధర్, కార్యదర్శి సిద్దొజు సుమన్, కోశాధికారి సాలంద్ర జక్కన్న, వర్కింగ్ ప్రాసిడెంట్ కురిమిళ్ల సంపత్, వరంగల్ మండల అధ్యక్షుడు రామగిరి చెందు, కార్యదర్శి వెలిశోజు సతీష్, కలకొండ భిక్షపతి, కాసోజు రామచారీ, కలకోటి రమణ, తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా పనిచేయాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ రాష్ట్ర ప్రగతి భవన్ కు డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రజా భవన్ గా నామకరణం చేయడాన్ని ఆహ్వానిస్తూ నూతనంగా ఏర్పాటు చేయబడిన ప్రభుత్వాన్ని అభినందిస్తూ కాకతీయ విశ్వవిద్యాలంలోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రొఫెసర్ గాదె సమ్మయ, డా.ఎల్ పి రాజ్ కుమార్, ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డి పాలాభిషేకం, పూలమాలతో సత్కరించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పని చేయాలని, ప్రపంచ దేశాలు గర్వించదగ్గ భారత రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలు పర్చాలని రాష్ట్ర భౌగోళిక స్వరూప స్వభావాన్ని ప్రత్యామ్నాయ సంస్కృతిక పాలనని అందించాలని కాంగ్రెస్ పార్టీని కోరారు. మానవ హక్కుల ఉల్లంఘన కాకుండా ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఉత్పత్తి కులాల విద్యార్థుల ఆత్మబలిదానాలపై నిర్మించబడ్డ తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచ దేశాలు గర్వించదగ్గ రాష్టంగా తీర్చిదిద్దాలన్నారు. ఆ వైపుగా పాలనా విధి విధానాల రూపకల్పన చేయాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, నూతన పరిశ్రమ నిర్మాణం చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహించి పూలే, అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని విద్యార్థుల జీవన శైలిలో మార్పు వచ్చే విధమైన నూతన విద్యా విధానాన్ని అమలుపర్చాలని తెలిపారు. మహనీయుల జీవిత చరిత్రలను భవిష్యత్ తరాలకు ఆదర్శ ప్రాయంగా ఉండే విధమైన చట్టాల రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి కళ్లెపెల్లి ప్రశాంత్, విద్యార్థి నాయకులు చెల్పూరి శ్రీకాంత్, అరవింద్, నిఖిల్, పవన్ రామ్, ప్రేతావ్, అంజలి, కావ్య, సాయి ప్రియ, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## మంథని నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా శ్రీధర్ బాబు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మంథని అసెంబ్లీ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఐదో సారి ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 30న జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీధర్ బాబు తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన పుట్ట మధుపై 31,380 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శ్రీధర్ బాబుకు 1,03,822 ఓట్లు రాగా పుట్ట మధుకు 72,442 ఓట్లు వచ్చాయి. మంథని నియోజక వర్గం నుంచి అత్యధిక సార్లు గెలుపొందిన ఎమ్మెల్యేగా శ్రీధర్ బాబు రికార్డ్ సృష్టించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాద రావు వారసుడిగా 1999లో రాజకీయ ప్రవేశం చేసిన శ్రీధర్ బాబు 1999, 2004, 2009, 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగిన శ్రీధర్ బాబు రాజ శేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్ లో ఉన్నత విద్యా శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రిగా పని చేశారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్న శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మరోసారి మంత్రి గా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

## కాసోజు శ్రీకాంతాచారి ఆశయాలను కొనసాగిద్దాం

### ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి విష్ణువర్ధన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమ తొలి అమరుడు, విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ దివంగత కాసోజు శ్రీకాంతాచారి ఆశయాలను కొనసాగిద్దామని విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్, గ్రేటర్ వరంగల్ ప్రెస క్లబ్ సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ అన్నారు. ఆదివారం కాసోజు శ్రీకాంతచారి వర్ధంతిని పురస్కరించుకొని వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ జర్నలిస్టులు శ్రీకాంతచారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకోవాలని ఉద్యమం నడుస్తున్న క్రమంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి ప్రాణ త్యాగంతోనైనా తెలంగాణను సాధించ్చుకోవచ్చనే ఆలోచనతో కాసోజు శ్రీకాంతచారి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అమరుడు కావడం విశ్వబ్రాహ్మణ జాతిని కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుడైన శ్రీకాంతచారి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి నానా ఇబ్బందులకు గురి చేశారని, వారి కుటుంబాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ఏర్పాటు అనంతరం శ్రీకాంతచారి కుటుంబాన్ని ఆదుకొని సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ జర్నలిస్టులు ఓదెల సత్యనారాయణ, బొల్లోజు సురేష్ బాబు, చిట్టోజు శ్రీనివాస్, మారేడుగొండ రాజనరేందర్, కసోజుల సుదర్శన చారి తదితరులు పాల్గొన్నారు.

# నా ఎదుగుదలకు ఏవీవీ విద్యాసంస్థలే మూలం

## సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నం నాగేశ్వరరావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ కళాశాలలో ఆచార్య చందాకాంతయ్య శ్రేష్టి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన సభకు అధ్యక్షత వహిస్తూ ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయకుమార్ మాట్లాడుతూ మా నాన్నగారు చూపిన దారిలో ఏవీవీ విద్యాసంస్థలను అహర్నిశలు శ్రమిస్తూ ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. కళాశాల అభివృద్ధి కోసం ఎల్లవేళలా శ్రమిస్తున్నామని తెలిపారు. నూతన భవన నిర్మాణం కోసం పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏవీవీ పూర్వ విద్యార్థి విశ్రాంత ఐపీఎస్, మన్నెం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆనాటికి ఈనాటికి ఏవీవీ విద్యాసంస్థలు పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ఈ కళాశాల పేద విద్యార్థులకు కల్పవృక్షంగా విరాజుల్లుతుందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానని మాట ఇచ్చారు. అనంతరం పూర్వ విద్యార్థి, పాలకమండలి సభ్యుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యాసంస్థల నిర్మాణానికి, అభివృద్ధికి విద్యార్థుల ఉన్నతికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అలాగే జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అనుక్షణం ముందుచూపుతో వ్యవహరిస్తూ విద్యాబోధన చేస్తూ ప్రతి సంవత్సరం ప్రతిభావంతులైన విద్యార్థులకు యాజమాన్యం సహాయంతో స్వర్ణ పథకాను అందజేస్తున్నామని తెలిపారు. డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ వి. వెంకటేశ్వరరావు విద్యార్థులందరూ ఆచార్య చందాకాంతయ్య గా ఆశయాలకు అనుగుణంగా చదువును కొనసాగిస్తూ ముందు ముందు మంచి స్థానాలలో నిలుస్తూ జీవితాన్ని సాగించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ఆచార్య ఎస్ ఎస్ వీఎన్ శర్మ, వద్దిరాజు వెంకటేశ్వరరావు, చకిలం మదన్మోహన్, ఈ రామ్ రెడ్డి, మురళీ మోహన్, పుర ప్రముఖులు, ఏవీవీ విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర విద్యార్థి బృందం పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# సత్తన్న గెలుపు ప్రజల విజయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ గెలుపును ప్రజల విజయంగా కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే నంజే గౌడ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పెట్టిన ప్రలోభాలకు మొగ్గ చూపకుండా మార్పు కోరుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు.

### అంబరానంటిన సంబరాలు..

సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణ రావు భారీ మెజార్టీతో గెలుపొందడంతో మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుతూ, నృత్యాలు చేస్తూ, గ్రామ పురవీధుల గుండా నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్, సీనియర్ నాయకుడు ఎన్ సంపత్ రావు, మాజీ ఎంపీపీ బాసని చంద్ర ప్రకాష్, మాజీ ఏఎంసీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, మండల ఉపాధ్యక్షుడు మారపల్లి కటయ్య, ఐఎన్ టీయూసీ మండల అధ్యక్షుడు మారేపల్లి రాజేందర్, సీనియర్ నాయకులు బాసని మార్కండేయ, భాషని శంకర్, పసునూటి రమేష్, ఉప సర్పంచ్ దోర్నాల రాజు, వడ్డేపల్లి శ్రీనివాస్, ఎండీ రఫీ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పోరాటంతోనే ఎర్రబెల్లి ఓటమి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఎర్రబెల్లి దయాకర్ రావు ఓటమితో పాలకుర్తి నియోజకవర్గంలో అరాచక పాలన, నిరంకుశ, నియంతృత్వ పాలన అంతమైందని, పాలకుర్తి ప్రజలకు విముక్తి లభించిందని, బీజేపీ ఉద్యమం ప్రభావంతోనే దయాకర్ రావు ఓటమి పాలయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి లేగా రాం మోహన్ రెడ్డి తెలిపారు. తొర్రూరులో సోమవారం బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి ఎరుగని ధీరుడని గొప్పలు చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్ రావుకు పాలకుర్తి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి చిత్తు చిత్తుగా ఓడించారన్నారు. ప్రజలను మాయమాటలతో మభ్య పెట్టాలని చూసినా, ఎన్నో రకాల ప్రలోభాలకు గురి చేసినా, డబ్బు, మద్యం ఎరజూపినా కూడా పాలకుర్తి ప్రజలు చాలా చైతన్యవంతులని, ఎర్రబెల్లికి సరైన గుణపాఠం చెప్పి పాలకుర్తి నుంచి తరిమి కొట్టారని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందకుండా చేసి తన అనుయాయులకు, సొంత పార్టీ కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూర్చిన దయాకర్ రావుకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన అంతమైందని, తెలంగాణ ప్రజలకు కేసీఆర్ నియంతృత్వ పాలన నుంచి విముక్తి లభించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి ఓట్లు దండుకున్నదని, డబ్బు, మద్యం విపరీతంగా పంపిణీ చేసే ప్రజాస్వామ్య వ్యవస్థ ను అపహాస్యం చేసిందని తెలిపారు. ఈసమావేశంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా నాయకులు 15వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు, దుబ్బ రాజశేఖర్, జిల్లా కార్యదర్శులు సాయిని ఝాన్సీ, సోమన్న, తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్ , చింతా సృజన్, కమ్మగాని శ్రీకాంత్, రాజేష్, ఉపేంధర్, యాకయ్య ,పులేందర్, విజయ్ కుమార్, నవీన్, సంతోష్, శివ, రాజేందర్ ,రవి, సందీప్, శివ సాయి, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలుపుపై సంబురాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గెలుపుపై ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకుంటున్నారు. ముఖ్యంగా వరంగల్ జిల్లాలో 12 సీట్లకు 10 స్థానాల్లో హస్తం తన సత్తాను చాటింది. తూర్పులో కొండా సురేఖ 15వేలకు పై చిలుకు మెజార్టీతో విజయం సాధించడంపై గ్రేటర్ వరంగల్ 34వ డివిజన్ మాజీ కార్పొరేటర్ శామంతుల ఉష శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. శివనగర్ లో పార్టీ శ్రేణులతో కలిసి స్వీట్లు పంచి, సంబురాలు జరుపుకున్నారు. ఎన్నికల్లో మాజీ మంత్రి కొండా సురేఖకు ఓట్లేసి గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

# ఇచ్చిన హామీలను కాంగ్రెస్ చిత్తశుద్ధితో అమలు జరపాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన చైతన్యవంతులైన తెలంగాణ ఓటర్లు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. తెలంగాణ అమరవీరుల ఆశయాలకు విరుద్ధంగా ప్రజల ఆకాంక్షలను విస్మరించి హైదరాబాదులో ధర్నా చౌక్ సైతం రద్దుచేసి ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలతో దొరల గడీల పాలన కొనసాగించిన దుర్మార్గ పాలకులకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పు పట్ల వెంకట్రాములు హర్షాన్ని వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలఎన్నికలలో బీసీల రిజర్వేషన్లు 23శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని చేసిన వాగ్దానంతో పాటు పేదలకు ఇళ్ల స్థలాలు , పక్కా గృహాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు, ఉపాధి హామీ కార్మికులకు 12వేల రూపాయల ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలైన ఎన్నికల వాగ్దానాలను , చెప్పిన గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ధృఢ సంకల్పంతో నిర్ణీత కాల వ్యవధిలో అమలు జరిపి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

# బీఆర్ఎస్ ఓటమికి నియంతృత్వ విధానాలే కారణం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా అనుసరించిన నియంతృత్వ, అ ప్రజాస్వామిక విధానాల వల్లనే ఓడిపోయిందని, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆరెల్లి కృష్ణ అన్నారు. సోమవారం న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన ఏకశిలా నగర్ లో జరిగిన ఎన్నికల సమీక్ష కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఆరెల్లి కృష్ణ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించిందని, గత ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయనందు వల్ల తర్వాత తాను తెచ్చిన జనాకర్షణ పథకాలు పార్టీ నాయకులు కార్యకర్తలకే దక్కడం వల్ల ప్రశ్నించిన ప్రజాసామిక, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించినందువల్లనే బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పునిచ్చారని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం వింతేమీ కాదని, ప్రజల తీర్పుకు అనుగుణంగా పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు అమలు చేయాలని ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలగకుండా చూడాలని, గత ప్రభుత్వం ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని రాబోవు ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్ టీయూ నాయకులు ఎర్ర జయబాబు, సాంబయ్య, హరిబాబు, తదితరులతోపాటు న్యూ డెమోక్రసీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటా

## వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిర్విరామంగా పార్టీ కోసం పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యే గెలిపించిన ఓటరు మహాశయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం ఎన్నికల ఫలితాల అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక సాధారణ కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిన తనకు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం ఇవ్వగా ఓట్లు వేసి నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించిన నియోజకవర్గ ప్రజలకు కేఆర్ నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు పాటుపడిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలు, నాయకులకు అందరికీ 24 గంటలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని ప్రతి గడపకు అందజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# కడియం శ్రీహరిని కలిసిన పాగాల సంపత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన కడియం శ్రీహరిని జనగామ జిల్లా జడ్పీ చైర్మన్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పాగాల సంపత్ రెడ్డి సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి తన గెలుపుకు కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

## మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని గత రెండు పర్యాయలు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తెలిపారు. ప్రజా తీర్పును గౌరవిస్తామని అన్నారు. రాజకీయాలలో గెలుపోటములు సహజం అని తెలిపారు. అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యల పట్ల పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగేలా చూస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు ఎవరూ బాధ పడవద్దు, అధైర్యపడొద్దని కోరారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. పదవిలో ఉన్నా లేకపోయినా నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, వారి కష్ట సుఖాలలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోతు కవిత



**వరంగల్ వాయిస్, మరిపెడ:** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తీర్పును శిరసావహిస్తామని మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, ఎంపీ మాలోతు కవిత అన్నారు. సోమవారం మరిపెడ పట్టణ మున్సిపల్ కేంద్రంలోని నవీన్ రావు గెస్ట్ హౌజ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్ రావుతో కలసి ఎంపీ కవిత మాట్లాడారు. గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. కార్యకర్తలు అధైర్య పడకండి అండగా ఉంటామన్నారు. ఓటమిలో లోటు పాట్లపై పునః సమీక్ష చేసుకుని పార్టీ శ్రేణులకు, ప్రజలకు అందుబాటులో ఉండి కష్ట సుఖాల్లో పాలు పంచు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సింధూర రవి, ఎంపీపీ అరుణ రాంబాబు, జడ్పీటీసీ శారద రవీందర్ నాయక్, కుడితి మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్న, వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చి రెడ్డి, ఉప్పల నాగేశ్వర రావు, పి.వెంకన్న, సయ్యద్ లతీఫ్, మక్సుద్ లు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విజ్ఞాన భారతిలో డ్రాయింగ్ కోర్సు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ ప్రాంతంలోని ఎల్బీనగర్ కు చెందిన శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్ లో సాగంటి ఆర్ట్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల ఆధ్వర్యంలో డ్రాయింగ్ శిక్షణను ప్రారంభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ డా.సామల శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతినిత్యం చదువుతో పాటు అన్ని రంగాల్లో శిక్షణ ఇవ్వాలని తద్వారా వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదిగే అవకాశం ఉందని, కాబట్టి వారి ఆసక్తిని గమనించి, వారిలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రయత్నం చేయాలని సూచించారు. అన్ని కళల్లో కెల్లా డ్రాయింగ్ చాలా ఓపికతో కూడుకున్నదని, డ్రాయింగ్ నేర్చుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. డ్రాయింగ్ లో డిప్లమో కోర్సులు నేర్చుకొన్న విద్యార్థులు ఎందరో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారని, కాబట్టి తమ పాఠశాలలో విద్యార్థులకు ఈ డ్రాయింగ్ కోర్సును ప్రారంభించినట్లు శశిధర్ రెడ్డి తెలిపారు. అనంతరం సాగంటి అకాడమీ ద్వారా పూర్వ విద్యార్థులకు నేర్పించిన డ్రాయింగ్ ప్రతులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ముష్కు రోజా రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్‌కు అభినందనలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు నిన్న జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ గెలుపొందిన సందర్భంలో కాశిబుగ్గలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్ కు కాంగ్రెస్ నాయకులు బండారి కన్నయ్య శాఖమూరి విజయ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గన్ను రాజేందర్, తోట బాలరాజ్, సామల రఘు, చెమ్మాల గోవర్ధన్, పెరుమాళ్ల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# 10న మోషన్ కాలేజీలో టాలెంట్ టెస్ట్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని నయీంనగర్ మోషన్ కాలేజీలో ఈనెల 10న జరిగే మోషన్ టాలెంట్ టెస్ట్ ఎగ్జామ్ బ్రోచర్ ను మోషన్ ఐఐటీ నీట్ కాలేజీ హనుమకొండ బ్రాంచ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ కొన్ని వేల మంది ఐఐటీ, మెడికల్ సీట్లు సాధించి దేశంలోని అగ్రగామి విద్య సంస్థ అయినటువంటి రాజస్థాన్ కోటా మోషన్ ఐఐటీ, నీట్ ఇన్ స్టిట్యూట్ వారు దేశవ్యాప్తంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం టాలెంట్ టెస్ట్ ఈ నెల 10న (ఆదివారం) నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్ష హనుమకొండ, నయీం నగర్, మోషన్ ఐఐటీ నీట్ కాలేజీలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. ఈ టాలెంట్ టెస్ట్ లో దేశ వ్యాప్తంగా మెరిట్ సాధించిన 500మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్, రూ.125 కోట్ల స్కాలర్ షిప్, రూ.75లక్షల క్యాష్ ప్రైజ్, రాజస్థాన్ కోటా హెడ్ బ్రాంచ్ నుంచి ఇవ్వడం జరుగుతుందని, అలాగే మోషన్ ఐఐటీ, నీట్ కాలేజీ హనుమకొండ బ్రాంచ్ వారు ప్రత్యేకంగా ఈ టాలెంట్ టెస్ట్ లో మెరిట్ సాధించిన మొదటి ముగ్గురు ర్యాంకర్లకు 10లక్షల విలువ గల ఉచిత హాస్టల్ తో కూడిన కోచింగ్, మొదటి 3 ర్యాంకర్ల కు ట్యాబులు , తర్వాత మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.6లక్షల విలువ గల ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి స్కూల్ టాపర్లకు ఈ మెమెంటో తో పాటు మెరిట్ సర్టిఫికెట్, పరీక్ కు హాజరైన ప్రతి విద్యార్థికి కాలేజీ ఫీజులో 20 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంతటి మంచి సదావకాశాన్ని ఇప్పుడు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోషన్ టాలెంట్ టెస్ట్ రాసే విద్యార్థులు 9 వ తేదీ సాయంత్రం లోపు 9703000850, 9703000851, 9703000852 ఫోన్ నెంబర్ లకు గానీ, హనుమకొండ నయీంనగర్ లోని మోషన్ కాలేజీలో మీ వివరాలు నమోదు చేసుకో గలరని వేణుగోపాల్ గౌడ్ సూచించారు.

# పాలకుర్తిలో నియంతృత్వ పాలనకు చరమగీతం



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** నియోజకవర్గం దేవరుప్పుల మండలం కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ 40ఏళ్ల చరిత్రలో పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్విని రెడ్డికి పట్టం కట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ స్కీం లను ప్రతి గడపగడపకు చేరవేస్తామన్నారు. రైతన్నలకు రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అందేలా చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల అరాచకాలకు, అక్రమాలకు, ఇసుక దందాలకు, దౌర్జన్యాలు ఇక సాగవని హెచ్చరించారు. పాలకుర్తి నియోజకవర్గానికి డిసెంబర్ 3న స్వాతంత్రం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల, బడుగు బలహీన వర్గాల కోసం, నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి హనుమాండ్ల ఝాన్సీ యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు సర్జన్ నాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్, పెద్దమదూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు రుద్రోజు పురుషోత్తం, ధర్మ గడ్డ తండా అధ్యక్షుడు యాదగిరి, సీనియర్ నాయకులు మాసంపల్లి మహేందర్ దరావత్ శీను, రెడ్డి రాజుల రమేష్, సుడిగాల నరేష్,పెద్ది శ్రీను, ఉప్పుల ప్రకాష్, కొంగరి ఉమేష్, చింత నిఖిల్, కడారి అంజయ్య, బట్ట అబ్బయ్య, బోనగిరి భాస్కర్, రాజేందర్, జాటోతు వీరా నాయక్, కత్తుల పవన్‌కుమార్, బాషిపాక అనిల్, చింత ఉపేందర్ పాల్గొన్నారు.

# అధికారులకు అభినందనలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు 2023 అక్టోబర్ 9న ప్రకటించినప్పటి నుంచి మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలలో నవంబర్ 3న నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి, నవంబర్ 30న పోలింగ్ నిర్వహణ, డిసెంబర్ 3న కౌంటింగ్ నిర్వహణ వరకు జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు నిర్విరామంగా కృషిచేయడంతో పాటు విజయవంతం కావడానికి దోహద పడిన అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె శశాంక ధన్యవాదాలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, రిటర్నింగ్ అధికారులైన రెవిన్యూ డివిజినల్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులైన తహసీల్దార్లకు, రెవెన్యూ సిబ్బందికి, సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, పోలీస్ సిబ్బందికి, నోడల్ ఆఫీసర్లు గా పని చేసిన జిల్లా అధికార్లకు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సెక్టార్ ఆఫీసర్లుగా పని చేసిన మండల స్తాయి వివిధ శాఖల అధికారులకు, కౌంటింగ్ అసిస్టెంట్లకు, బూత్ లెవెల్ సూపర్వైజర్లకు, బూత్ లెవెల్ అధికారులకు, పంచాయతీ సెక్రటరీలకు, స్వీప్ నిర్వహణకు కృషి చేసిన అధికారులకు, ఎంసీసీ కోసం పని చేసిన ఎస్ ఎస్ టీ, ఎఫ్ ఎస్ టీ, వీఎస్ టీ బృందాలకు, ఎక్స్పెండిచర్ ఏఈఓఎస్, ఏటీఎస్ బృందాలకు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బందికి, ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులకు, ఇంజినీరింగ్, విద్యుత్తు, వైద్య, ఇతర శాఖల సిబ్బందికి, మీడియా సిబ్బందికి, పోలింగ్గ్ పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలకు, సహకరించిన రాజకీయ పక్షాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

# అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదు

## బీజేపీ అభ్యర్థి చంద్రుపట్ల సునీల్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాటారం:** కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని డబ్బులు ఖర్చు పెట్టిన కూడా నా మీద నమ్మకం తో నాకు ఓటు వేసిన ప్రతి ఒకరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మంథని బీజేపీ అభ్యర్థి చంద్రుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ తెలంగాణలో మరింత శక్తి వంతమైన పార్టీగా అవతరిస్తుందన్నారు. మంథని పట్టణంలోని బీజేపీ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి పాల్గొన్నారు. అనంతరం సునీల్ మాట్లాడుతూ అధికారం ఎవరికీ శాశ్వతం కాదు, ఓటమితో మరింత బలంగా అవుతామని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీలు నెరవేర్చలేని పక్షంలో ప్రజల తరుపున పోరాడుతామని అన్నారు. మంథనిలో చిల్లర రాజకీయాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తెరలేపారు. నేను శ్రీధర్ బాబుకు అమ్ముడు పోయానని బీఆర్ఎస్ నాయకులు, పుట్ట మధుకు అమ్ముడు పోయానని, కాంగ్రెస్ నాయకులు విష ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథనిలో మార్పు కోసం పరితపిస్తున్న, మంథనిలో కాలేజీ లు, ఫ్యాక్టరీ లు, హాస్పిటల్ లు రావాలని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ కొండపాక సత్యప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి పోతారవేణి క్రాంతికుమార్, కాటారం మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు పూసల రాజేంద్ర ప్రసాద్, బొల్లం కిషన్, మేడిపల్లి పూర్ణ చందర్, మండల ఉపాధ్యక్షుడు రేపాక శంకర్, సీనియర్ నాయకులు కొట్టె సాంబయ్య, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయభేరి

## వచ్చే కేంద్ర ఎన్నికలకు దిక్సూచి
## బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గం బీజేపీ ప్రెస్ మీట్ లో వరంగల్ తూర్పు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు మనో ధైర్యాన్ని కోల్పోకుండా పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు సాగాలని కోరారు ప్రతి బిజెపి కార్యకర్తకు వెన్నంటూ ఉంటానని తెలిపారు. అదేవిధంగా రాజకీయాల్లో ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం బలపరిచిన తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావును యావత్తు బీజేపీ వరంగల్ నాయకులు కార్యకర్తలు స్వాగతించి, వారితో పాటు ఈ ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడి పనిచేయడం జరిగిందని తెలిపారు. 2018 ఎన్నికల్లో పోల్చితే, ఈ ఎన్నికల్లో 51వేల పైచిలుకు ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారు. మిగతా పార్టీలతో పోల్చుకుంటే సౌమ్యుడైనా ప్రదీప్ రావు అతి తక్కువ ఓట్ల తేడాతో రెండో స్థానంలో నిలబడ్డారని పేర్కొన్నారు. నైతికంగా డబ్బు ప్రభావం లేకుండా , ప్రజాధరణతో ఇన్ని ఓట్లు వేసినందుకు వరంగల్ తూర్పు ఓటరు మహాశయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజా తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు దిశగా ఉన్నందున, వారుఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ప్రజలకు ఇప్పటి నుంచి ఆరు నెలల లోపు అమలుకు నోచుకోవాలని, లేకుంటే బీజేపీ తరపున ప్రజలను మమేకం చేస్తూ మరో ప్రజా ఉద్యమం చేపడతామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు వాగ్దానాలను విస్మరిస్తే కేసీఆర్ కు పట్టిన గతే కాంగ్రెస్ కూడా పునారవృతం అవుతుందన్నారు. మూడు రాష్ట్రాలలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్గడ్ రాష్ట్రాల్లో బీజేపీ ఘనవిజయం సాధించి, 2024లో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యావత్ భారత ప్రజానీకం నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని సంకేతాలు ఇచ్చారని చెప్పారు. అతిపెద్ద రాష్ట్రాలైనా మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలో డబుల్ డిజిట్ కే పరిమితమైన కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఇండియా కూటమికి చిల్లు పడిందని ప్రజలు నిరూపించారు. దీంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇండియా కూటమి బీజేపీకి ఏమాత్రం పోటీ కాదని డాక్టర్ వన్నాల వెంకటరమణ విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ముంద్రాతి వెంకటేశ్వర్లు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసి రాజు, బీజేవైఎం రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ అపురూప రజనిష్ నేత, డివిజన్ అధ్యక్షులు జున్ను సుబ్రహ్మణ్యం, క్యాతం రాజ్ కుమార్, చంద్రమౌళి, వంగ సంపత్, దేవేందర్, సంగీత్, వంగరి ప్రదీప్, జగన్ పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేయాలని ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేయాలని హనుమకొండ పట్టణంలో సోమవారం పేదలు ధర్నా నిర్వహించారు. బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ సమీపంలోని జితేందర్ నగర్ లో ఈ ఘటన చోటు చేసుకొంది. గత ఏడు సంవత్సరాల క్రితం పూర్తైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అక్కడ నివసిస్తున్న పేదలైన అంబేద్కర్ నగర్, జితేందర్ సింగ్ నగర్ వాసులకు ఇవ్వకుండా ఆలస్యం చేసినందుకు గాను సోమవారం ఉదయం రెండు కాలనీలకు చెందిన సుమారు 400మంది గుడిసె వాసులు బస్తీ కమిటీ అధ్యక్షుడు ఎర్ర చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పేదలు మాట్లాడుతూ గత ఏడెనిమిది ఏళ్లుగా తమకు ఇండ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. గత సంవత్సరం నుంచి ప్రభుత్వ చీఫ్ విప్ గా ఉన్న దాస్యం వినయ్ భాస్కర్ తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామంటూ చెప్పారని, కానీ తమకు ఇప్పటి వరకు ఇవ్వలేదని అన్నారు. తాము రోడ్డుపై జీవిస్తున్నామని, వెంటనే తమకు జితేందర్ నగర్ లోని డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ప్రతిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా మల్లికాంబ కేంద్రంలోని దివ్యాంగులైన చిన్నారులకు ప్రతిమ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా డా.తిప్పని అవినాష్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ అంకలోజిస్ట్ ) ప్రతిమ క్యాన్సర్ ఇన్ స్టిట్యూట్ వారు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.అవినాష్ మాట్లాడుతూ మల్లికాంబ సంస్థలో 15ఏళ్ల నుంచి పిల్లలకు సేవ చేస్తున్న సిబ్బంది ఓద్దెమ్మ అనే మహిళకు క్యాన్సర్ వస్తే ఉచితంగా ప్రతిమ క్యాన్సర్ ఇన్ స్టిట్యూట్ నుంచి ఉచితంగా సర్జరీ, మందులు అందించడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని దాని ద్వారా ఈ సంస్థకు కూడా మా వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం వైద్య శిబిరంలో అవినాష్ గ్యాస్టిక్ పరీక్షలు, డా.సుమిత్రా, రమేష్ చర్మ సంబంధిత పరీక్షలు, డా.ప్రియాంక దంత సంబందిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే చిన్నారులకు అస్పత్రిలో ఉచిత వైద్య సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బండా రామ లీల, ప్రొ.పద్మ, కోడం కల్యాణ్, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైపే పాలకుర్తి ప్రజలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన యశస్విని రెడ్డిని ఓడించడానికి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎన్ని జిమ్మిక్కులు చేసినా పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ వైపే నిలిచారని మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ లు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాలకుర్తిలో నిరంకుశ, నియంత్రృత్వ పాలన అంతం అయిందని, ప్రజలకు విముక్తి లభించిందని, ఓటమి ఎరుగని ధీరుడని గొప్పలు చెప్పుకునే దయాకర్ రావుకు పాలకుర్తి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి చిత్తు చిత్తుగా ఓడించారని, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఎర్రబెల్లి అధికార అహంకారంతో భయభ్రాంతులకు గురి చేశాడని విమర్శించారు. అరాచక పాలనకు అంతం చేసి ప్రజాపాలనకు పట్టం కట్టి మంచి పాలన చేసే యశస్విని రెడ్డికి పాలకుర్తిలో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించిన పాలకుర్తి ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ కార్డులు ప్రజలకు చెందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్య నాయక్, రాయపర్తి మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ అనుమండ్ల నరేందర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నర్మ్యాటి గజానంద్, భూసాని రాము, సర్పంచులు గోవర్ధన్ రెడ్డి, కాటం మల్లారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోత్ రవి నాయక్, యూత్ పట్టణ అధ్యక్షుడు బసలబోయిన మహేష్, కాంగ్రెస్ నాయకులు అచ్చిరెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, దేవరకొండ శ్రీనివాస్, మెరుగు మల్లేశం గౌడ్, దేవేందర్ రాజు, దీకొండ మధు, రమేష్, బానోత్ సాగర్, సంతోష్, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజు గెలుపు కోసం సహకరించిన ప్రతీ ఒక్కరికి మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కార్యకర్తలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మండల నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని గత రెండు పర్యాయాలు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని తొర్రూరు జడ్పీటీసీ మంగళ పల్లి శ్రీనివాస్ అన్నారు. రాజకీయాలలో గెలుపోటములు సహజం, అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యల పట్ల పోరాటం కొనసాగిస్తామని పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగేలా చూస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు అభినందనలు తెలిపారు. పాలకుర్తి బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు ఎవరూ బాధ పడొద్దు, అదైర్యపడొద్దు, పార్టీ నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. పదవిలో ఉన్నా లేకపోయినా నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో, వారి కష్ట సుఖలలో అండగా ఉంటామని తెలిపారు.

## ఉపాధ్యాయురాలు
## పోరండ్ల స్వాతికి సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ నర్సంపేటకు చెందిన గణిత ఉపాధ్యాయురాలు పొరండ్ల స్వాతిని ఆర్ఎల్ సీ శ్రీ పాల సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆర్ఎల్ సీ శ్రీ పాల మాట్లాడుతూ పోరండ్ల స్వాతి తెలంగాణ మైనారిటీ ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూషన్ 204స్కూళ్ల నుంచి గణిత ఒలంపియాడ్ ప్రిపరేషన్ లో మెంబర్ గా ఉంటూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం ఒలంపియాడ్ ప్రిపరేషన్ కు ప్రత్యేక మెటీరియల్ ను రూపొందించి విద్యార్థుల భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకు గాను సోమవారం నర్సంపేట మైనారిటీ గురుకుల పాఠశాలకు వచ్చి తనను అభినందించడం జరిగిందన్నారు. రానున్న రోజులలో కూడా మైనారిటీ పాఠశాలల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 19వ డివిజన్ లో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ గెలుపొందిన సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో కాశిబుగ్గలో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తానా సమ్మక్క రాజమణి దుగ్యాల రాము, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 04, డిసెంబర్ 2023
7

# తీవ్రమైన భావోద్వేగం కలగుతుంది

## అందుకేనేమో.. జాన్వీకపూర్



శ్రీదేవి నట వారసురాలిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టింది.. జాన్వీ కపూర్. ధడక్' సినిమాతో బాలీవుడ్ తెరకు పరిచయమైన అతిలోక సుందరి కూతురు 'దేవర' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమవుతోంది. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న మాస్ యాక్షన్‌లో ఆమె కథానాయికగా నటిస్తోంది. కొరటాల శివ దర్శకుడు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. జాన్వీ ఇందులో తంగమ్ అనే పాత్రలో కనిపించనుంది. తాజాగా సెట్‌లో ఈ సినిమా అనుభవాల్ని పంచుకుంది. "దేవర' కోసం సెట్లోకి అడుగు పెట్టిన ప్రతిసారీ నేను నా ఇంటికి వస్తున్నట్లు అనిపిస్తుంది. సెట్లోని ప్రతి ఒక్కరూ నా సొంత మనుషుల అనిపిస్తారు. అంతే ప్రేమతో చూస్తారు. ఇది అమ్మతో నాకున్న తీవ్రమైన భావోద్వేగ అనుబంధం వల్ల జరుగుతుందనిపిస్తుంది. దేవర అవకాశంతో దక్షిణాదిన సినిమా చేయడం ద్వారా అమ్మతో అటాచ్ అయినట్లు అనిపిస్తోంది. ఇదొక ఆధ్యాత్మిక అనుభూతి' అని జాన్వీ చెప్పుకొచ్చింది. తెలుగులో ఆమె నటిస్తున్న తొలి చిత్రమిది. దర్శకుడు రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. తొలి భాగం 'దేవర పార్ట్-1గా వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి అనిరుద్ధ్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు ఛాయగ్రాహకుడిగా పని చేస్తున్నారు.



## మా కెమిస్ట్రీకి చక్కని స్పందన వస్తోంది. త్రిప్తి డిమ్రి

రణ్‌బీర్ కపూర్, రష్మిక మందన్నా జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'యానిమల్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రి.. జోయా అనే పాత్ర పోషించారు. ఆమె కనిపించింది కొద్ది సమయమే అయినప్పటికీ ఆమె నటనకు ప్రేక్షకులకు ఫిదా అయ్యారు. రణ్‌బీర్ – త్రిప్తి మధ్య సన్నివేశాలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. త్రిప్తి మాట్లాడుతూ "రణ్‌బీర్ కపూర్‌తో వర్క్ చేయడం అద్భుతంగా ఉంది. ఆయన గొప్ప నటుడు మాత్రమే కాదు.. మంచి మనసు ఉన్న వ్యక్తి. యానిమల్'లో మా కెమిస్ట్రీకి ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన వస్తోంది. భవిష్యత్తులో మేము మరోసారి కలిసి పనిచేసే అవకాశం వస్తుందని ఆశిస్తున్నా" అని త్రిప్తి డిమ్రి అన్నారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం నిడివి ఎక్కువ, వయలెన్స్ ఎక్కువ అనే కారణాలతో కాస్త నెగటివ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ బాక్సాఫీస్ దగ్గర మాత్రం కలెక్షన్ల వర్షం కురిపించింది. మూడు రోజుల్లో సుమారుగా రూ.226 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

## కాంగ్రెస్ పాలనపై సంచలన కామెంట్

### ఇక తెలంగాణలో రావణ రాజ్యమే అంటూ పోస్టు



తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్స్‌లో కాంగ్రెస్ గెలుపొందడంపై హీరోయిన్ మాధవీలత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పార్టీలో ఉన్నా ఆమె కాంగ్రెస్ పార్టీ గెలుపుపై ఇన్స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ చేశారు. ఇక తెలంగాణలో నడిచేది రావణ రాజ్యమే అని కామెంట్ చేశారు. ఈ మేరకు ఆమె చేసిన పోస్ట్‌లో ఏముందంటే.. "ఐదేళ్ల తర్వాత తెలంగాణలో తినడానికి తిండి ఉండదు, ఉద్యోగాలు రావు, మహిళలకు భద్రత కరువవుతుంది. హిందూ పండుగలు జరగవు, స్వేచ్ఛ అనేది కనిపించదు. తెలంగాణ కాంగ్రెస్ లవర్స్ అందరికీ నా శుభాకాంక్షలు. ఇకపై రావణ సామ్రాజ్యమే. ఎంజాయ్ చేయండి" అని ఇన్స్టా పోస్ట్‌లో పేర్కొంది. అంతే కాదు.. కాంగ్రెస్‌తో పోలిస్తే. బీఆర్ఎస్‌కు 99 మార్కులు ఇస్తాను' అని కామెంట్ చేసింది. ప్రస్తుతం ఆమె చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. నెటిజన్లు మాత్రం మాధవీలతను కామెంట్లతో ఓ ఆట ఆడుకుంటున్నారు. "అది ప్రజలు ఇచ్చిన తీర్పు. దానిని అందరూ గౌరవించాలి. ఓసారి నువ్వు పార్టీ నుంచి బయటకొచ్చి చూడు. లోకం ఎలా ఉందో తెలుస్తుంది' అని ఓ నెటిజెన్ కామెంట్ చేశారు. మణిపూర్‌లో ఓ మహిళను నగ్నంగా రోడ్డు మీద నడిపించిన సమయంలో రూలింగ్‌లో ఉన్న నీ పార్టీ ఏం చేసింది? అని ప్రశ్నించాడు మరో నెటిజన్. "నచ్చావులే' చిత్రంతో హీరోయిన్ గా కరీర్ ప్రారంభించింది మాధవీలతా. ఆడపాదడపా అవకాశాలు అందుకున్నా.. చెప్పుకోదగ్గ విజయాలేవీ వరించలేదు. ఇక సినిమాలకు స్వస్తి చెప్పి బీజేపీ పార్టీలో చేరింది. 2019లో గుంటూరు వెస్ట్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయింది.

## ప్రభాస్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్



పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎక్షయిటింగ్‌గా ఎదురుచూస్తున్న తెలుగు సినిమాల్లో సలార్ ఒకటి. కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, ప్రభాస్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఇప్పటికే విడుదల చేసిన సలార్ ట్రైలర్ యూట్యూబ్‌లో రికార్డులు బద్దలు కొడుతుంది. ఇప్పటివరకు ఈ సినిమా ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 150 మిలియన్ల (15కోట్లు)కు పైగా వ్యూస్ దాటాయి. ఈ ట్రైలర్‌కి ప్రశంసలతోపాటు విమర్శలు కూడా ఎదురవ్వడం చర్చనీయాశంగా మారింది. ఈ ట్రైలర్‌ని చూసిన కొందరు క్రిటిక్స్.. సినేరియా మొత్తం 'కేజీఎఫ్' తరహాలోనే ఉందని, కథ కూడా దాదాపు అలాగే ఉందని, దీన్ని 'కేజీఎఫ్ 3' అనుకోవచ్చని విమర్శలు గుప్పించారు. అయితే ఈ సినిమా ట్రైలర్‌పై విమర్శలు వస్తున్న నేపథ్యంలో మేకర్స్ సలార్ నుంచి రెండో ట్రైలర్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ ట్రైలర్‌ను సినిమా విడుదలకు 5 రోజుల ముందు చిత్రబృందం విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇక ఈ ట్రైలర్ ఫుల్ యాక్షన్ ప్యాక్‌డ్‌గా.. ప్రభాస్ రోల్‌ని హైలెట్ చేస్తుందని తెలుస్తుంది. కాగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ నెల 21న 'సలార్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే.

# కాంగ్రెస్ సునామి

## 10 స్థానాల్లో విజయ భేరి
## ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు దక్కినవి 2

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ సునామి సృష్టించిందనే చెప్పవచ్చు. మొత్తం 12 స్థానాలకు గాను 10 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కేవలం రెండు స్థానాల్లోనే బీఆర్ ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే ఓటమి ఎరుగని నేతలుగా రికార్డు సృష్టించిన వారు సైతం కాంగ్రెస్ సునామీలో కొట్టుకుపోవాల్సి వచ్చింది. పాలకుర్తి నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధిస్తున్న ఎర్రబెల్లి దయాకర్ రావు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి దాస్యం వినయ్ భాస్కర్, డోర్నకల్ నియోజకవర్గం నుంచి రెడ్యా నాయక్ లాంటి మహా మహులు సైతం ఓటమి పాలయ్యారు. మొత్తం 12మంది ఎమ్మెల్యేలలో ఏడుగురు మొట్ట మొదటి సారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

### వరంగల్ తూర్పు


విజేత
కొండా సురేఖ
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
67,757
మెజారిటీ
15,625


ప్రత్యర్థి
ఎర్రబెల్లి ప్రదీప్ రావు
(బీజేపీ)
పోలైన ఓట్లు
52,105

### వరంగల్ పశ్చిమ


విజేత
నాయిని రాజేందర్ రెడ్డి
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
72,649
మెజారిటీ
15,331


ప్రత్యర్థి
దాస్యం వినయ్ భాస్కర్
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
57,318

### పాలకుర్తి


విజేత
యశస్విని రెడ్డి
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
1,26,848
మెజారిటీ
47,634


ప్రత్యర్థి
ఎర్రబెల్లి దయాకర్ రావు
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
79,214

### నర్సంపేట


విజేత
దొంతి మాధవరెడ్డి
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
1,04,185
మెజారిటీ
18,889


ప్రత్యర్థి
పెద్ది సుదర్శన్ రెడ్డి
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
85,296

### పరకాల


విజేత
రేవూరి ప్రకాశ్ రెడ్డి
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
72,573
మెజారిటీ
7,941


ప్రత్యర్థి
చల్లా ధర్మారెడ్డి
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
64,632

### స్టేషన్ ఘన్ పూర్ (ఎస్సీ)


విజేత
కడియం శ్రీహరి
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
1,01,696
మెజారిటీ
7,779


ప్రత్యర్థి
సింగాపురం ఇందిర
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
93,917

### జనగామ


విజేత
పల్లా రాజేశ్వర్ రెడ్డి
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
98,975
మెజారిటీ
15,783


ప్రత్యర్థి
కొమ్మూరి ప్రతాప్ రెడ్డి
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
83,192

### వర్ధన్నపేట (ఎస్సీ)


విజేత
కేఆర్ నాగరాజు
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
1,06,696
మెజారిటీ
19,458


ప్రత్యర్థి
ఆరూరి రమేష్
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
87,238

### భూపాలపల్లి


విజేత
గండ్ర సత్యనారాయణ రావు
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
1,23,116
మెజారిటీ
52,699


ప్రత్యర్థి
గండ్ర వెంకటరమణా రెడ్డి
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
70,417

### ములుగు (ఎస్టీ)


విజేత
ధనసరి అనసూయ (సీతక్క)
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
1,02,267
మెజారిటీ
33,700


ప్రత్యర్థి
బడే నాగజ్యోతి
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
68,567

### డోర్నకల్ (ఎస్టీ)


విజేత
రామచంద్రు నాయక్
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
1,15,587
మెజారిటీ
53,131


ప్రత్యర్థి
రెడ్యానాయక్
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
62,456

### మహబూబాబాద్ (ఎస్టీ)


విజేత
భూక్య మురళీనాయక్
(కాంగ్రెస్)
పోలైన ఓట్లు
1,16,644
మెజారిటీ
50,171


ప్రత్యర్థి
బానోత్ శంకర్ నాయక్
(బీఆర్ఎస్)
పోలైన ఓట్లు
66,473

## న్యాయవాదుల సంబరాలు

**వరంగల్ వాయిస్, లీగల్ :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడంతో వరంగల్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ న్యాయవాదుల ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు చేశారు. హనుమకొండ అదాలత్ వద్ద న్యాయవాదులు పెద్దఎత్తున గుమిగూడి భారీ ఎత్తున టపాసులు కాల్చారు. జై కాంగ్రెస్ అంటూ నినదిస్తూ ప్రజల తీర్పు చారిత్రాత్మకమని కొనియాడారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. లీగల్ సెల్ న్యాయవాదులు తోట రాజ్ కుమార్, జగన్ మహన్ రెడ్డి, నల్ల మహాత్మా, శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ విజయం అన్ని వర్గాల ప్రజల కృషితోనే సాధ్యమైందన్నారు. రానున్న రోజుల్లో న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తామని, ప్రజాపాలన కాంగ్రెస్ తోనే సాధ్యమని పేర్కొ న్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com